## యాదాద్రి తరహాలో రాజన్న ఆలయ అభివృద్ధి: మంత్రి సురేఖ

వేములవాడ, అక్టోబర్ 14: యాదాద్రి తరహాలో వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖల మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సోమవారం కుటుంబ సమేతంగా రాజన్న సన్నిధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వచ్చారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారిని దర్శించుకుని కోడెమొక్కు చెల్లించుకున్నారు. తర్వాత మనవడి పుట్టి వెంట్రుకలు ఇచ్చి.. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాజన్న ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే దేవాలయ అభివృద్ధిపై అత్యున్నత సమావేశం వచ్చే నెలలో జరుగుతుందన్నారు. రాజన్న ఆలయానికి బంగారు తాపడం, వెండితో పల్లకీలు, ఉత్సవవిగ్రహాలు రూపొందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అతిథి గృహంలో మంత్రి కొండా సురేఖ-మురళీ దంపతులను విప్‌తో కలిసి రాష్ట్ర దేవాలయ జేఏసీ చైర్మన్ గజవెళ్లి రమేశ్‌బాబు సన్మానించారు.ఇక్కడ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మహేశ్, ఆర్డీవో రాజేశ్వర్, కమిషనర్ సంపత్‌రెడ్డి, తహసీల్దార్ మహేశ్‌కుమార్, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్, ఉద్యోగ సంఘం నాయకులు గోలి శ్రీనివాస్, ఎడ్ల శివసాయి, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.



మంత్రి సురేఖ కుటుంబ సభ్యులకు ప్రసాదం అందజేస్తున్న విప్

## కత్తితో దాడి

వేములవాడ, అక్టోబర్ 14: పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఆదివారం అర్ధరాత్రి పలువురు యువకులు కత్తితో దాడిచేయగా, పెంజర్ల కుమార్ గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. భగవంతరావునగర్‌లో ఒకే చోట రెండు దుర్గామాత మండపాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం తర్వాత మండపంలో యువకుల మధ్య జరుగుతున్న గొడవను ఆపేందుకు వెళ్లిన కుమార్‌పై కత్తితో దాడి చేయడంతో మెడ, ముఖం, చేతిపై గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం వేములవాడ ఏరియా దవాఖానకు తరలించారు. కాగా, బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు.

## కట్టుకున్నోడే కడతేర్చాడు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 14: కలకాలం తోడుఉంటే భర్త.. మద్యానికి బానిసై కట్టుకున్న భార్యను హత్యచేశాడు. అడవిపదిరలో జరిగిన ఈ హత్య కేసు మిస్టరీని 24గంటల్లోనే పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం వెల్లడించారు. వీర్నపల్లి మండలం జవహర్ నాయక్‌తండాకు చెందిన గుగులోత్ రవి-సుశీల దంపతులకు ఇద్దరు పిల్లలు షర్మిల, సాయిచరణ్ ఉన్నారు. రవి మద్యానికి బానిసై కావడంతో తరుచూ భార్య సుశీలతో గొడవ పడేవాడు. దసరా సందర్భంగా సుశీల తన పిల్లలతో కలిసి తల్లిగారి ఇల్లు అయిన అడవిపదిరకు వెళ్లింది. శనివారం రాత్రి భోజనం చేసి పడుకున్న సుశీల వద్దకు భర్త రవి వెళ్లాడు. తనతో రమ్మని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన రవి భార్య సుశీలను గొంతునులిమి హత్యచేశాడు. అనంతరం ఇంటి ముందున్న మంచంపై మృతదేహాన్ని పడేసి పరారయ్యాడు. సుశీల సోదరుడు లోక్‌నాయక్ ఫిర్యాదు మేరకు రవిపై ఠాణాలో కేసు నమోదు చేశారు. 24గంటల్లోనే అటవీ ప్రాంతంలో తలదాచుకున్న రవిని అరెస్ట్ చేసి.. సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేసు ఛేదింపులో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ మల్లాగౌడ్‌ను ఎస్పీ అఖిల్‌మహాజన్ అభినందించి రివార్డు అందించినట్లు పోలీసులు తెలిపారు. ప్రెస్‌మీట్‌లో ఎస్ఐ ఎల్లాగౌడ్, రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

















